# ప్లేసెబో

"సిక్స్-ఫోర్!,.. మనోహర్ సెట్‌ను - గేమ్‌ను గెలిచాడు!"అని ప్రకటించాడు అంపైరింగ్ చేసిన రేమన్.

"కంగ్రాట్స్ మనోహర్ .... దట్ వాజ్ ఎ గుడ్ గేమ్...." అభినందించాడు రవిచంద్ర. షేక్‌హేండ్ తీసుకుంటూ మనోహర్ "నువ్వు సరిగా ఆడలేదివాళ .... లేకపోతే అంత సులువుగా నన్ను గెలవనిస్తావా?"అన్నాడు. ఇద్దరూ టెన్నిస్ రాకెట్లను పక్కన పడేశారు.

రవిచంద్ర సెయింట్ బెర్నార్డ్ అస్పత్రి సూపరింటెండెంట్. మనోహర్ కస్టమ్స్ కలెక్టర్. ఓడ కెప్టెన్ రేమన్ - సెలవుమీద మదరాసు వచ్చాడు.

అది అయ్యాక ముగ్గురూ టెన్నిస్‌క్లబ్ లాన్స్‌లో కూర్చుని టీ తాగుతున్నారు.

బూడిదరంగు చీకటి ఆకాశాన్ని అలముకుంటూంది. ఉలిక్కిపడ్డట్టు నియాన్ దీపాలు వెలిగాయి. క్లబ్‌బాయ్ ఇటు అటు తిరుగుతున్నాడు అందరికీ అన్నీ అందిస్తూ...

--"ఎస్! నీ మనసు ఆటమీద లేదు యివాళ"అన్నాడు మనోహర్ మళ్ళీ.

"సమ్‌నైస్ న్యూ నర్స్?"అని కన్ను కొట్టాడు రేమన్.

"అబ్బెబ్బె... మావాడు ఋష్యశృంగుడండీ!"

"వాడెవడు?"

మనోహర్ కథంతా చెప్పాక ముగ్గురూ కలిసి గొల్లున నవ్వారు.

"అయితే లాభం లేదు డాక్టర్! నాతో ఈస్టరన్ వాయేజ్‌కి రండి. బాంకాక్‌లో ఒక వారం వుందురు కాని..."

"బాంకాక్ అంత పెద్ద కేటలిస్టా? "-- మనోహర్ ప్రశ్న.

"అక్కడ బిల్డింగ్‌కో డజను కేటలిస్టు లుంటాయి. ఋష్యశృంగుడిని ఒక్క

రోజులో వాత్స్యాయనుడిగా మార్చేయగలరు అక్కడి బ్యూటీస్..."

"మీ ఈస్టరన్ అఫర్ మా రవికేనా? లేక ఈ పూర్ కస్టమ్స్ ఫెలోకేమైనా..."

"ఎంతమాట... ఓడలవారికీ కస్టమ్స్ వారికీ వున్నది జన్మజన్మల బంధం కదా-----"అన్నాడు రేమన్.

"అయితే ఇద్దరూ కలసిపోయి ఈ డాక్టర్‌నిలా మూడోవ్యక్తిగా వుంచేశారన్న మాట---"రవిచంద్ర నిష్ఠూరం నటిస్తూ.

"నో నో.... అందులోనూ బాంకాక్ లాంటి వూళ్ళో డాక్టర్ల అవసరం ఎంతయినా వుంటుంది.---" అన్న మనోహర్ శ్లేషకు ముగ్గురూ నవ్వారు.

"మావాడు పనిలోపడితే ఇంకీ ప్రపంచం వుండదండీ---"అని మనోహర్ టేబిల్ మీదున్న పత్రికలను తిరగవేయసాగాడు.

"రీసర్చి ఏదయినా చేస్తున్నారా?"అన్న రేమన్ సందేహానికి రవిచంద్ర జవాబు చెప్పాడు. "అబ్బే... స్టేట్స్‌లో ఆరేళ్ళున్నపుడు కొద్దిగా వైద్య విషయాలమీద పుస్తకాలు, పత్రికలు చదవడం అలవాటయింది. అదింకా కొనసాగుతుందంతే. చదివిన దానిని గురించి ఆలోచించడం, సాధ్యమైనంత వరకు ఆచరణలోకి పెడదామని చూస్తుంటాడు ... అంతే తప్ప... పెద్ద రీసర్చి అంటూ ఏమీ చేయడంలేదు---"

"రీసర్చి అంటే మీరు చేసేదే కదా!"

"నోనో! అది తపస్సులాంటిది. నిశ్చల సమాధిలాంటిది. అన్వేషించే ఎన్‌జైమో, బాక్టీరియానో అదే, పరమాత్మ కాగా--- మిగతా ప్రపంచాన్ని మరచి త్రికరణ శుద్ధిగా అందులో లీనమైపోవాలి. అలాంటి వ్యక్తికి లెబోరేటరీయే నైమిశారణ్యం అవుతుంది... నాకా అవకాశం లేదు..."అన్నాడు రవిచంద్ర దూరంగా చూస్తూ.

సీగల్ ఒకటి కీచుమంటూ అరుస్తూ చెట్లవైపు ఎగురుతూ వెళ్ళింది.

ఇటు ధ్యాసమళ్ళించిన మనోహర్ ఆ మాట విని.... "అమ్మో! బాంకాక్ నుండి నైమిశానికి వచ్చారంటే వృత్తం పూర్తి అయిందన్నమాటే... దానికేంగాని ఇది వినండి. చాలా వింతగా వుంది." అంటూ చేతిలోని 'టైం'పత్రికలో జాన్‌బోర్గ్ ఇంటర్వ్యూనించి కొన్ని వాక్యాలు చదవసాగాడు.

"బోర్గ్ అంటాడు.- 'కోర్టులోకి వెళ్ళి ఆడడం మొదలు పెట్టేసరికి ఆట నింకొకరెవరూ గెలవలేరు. నే నక్కడ వుండగా ఇంకొకరు గెలవటమేమిటి -- అన్న అహంకారంలేని నమ్మకం నన్నావరిస్తుంది. ఆ కోర్టులో నేను సూపర్ మాన్‌ని. నేను కోరింది జరుగుతుంది. బంతి ఎక్కడ వాలితే నేను అక్కడ ఉండి తీరవలసిందే.... ఉన్నట్లుండి మనసులోకి ఒక కొత్త ఐడియా వస్తుంది. శాస్త్రంలో ఎక్కడా వర్ణించని 'షాట్'ను కొడతాను. ఇదేమిటని అందరు విస్తుపోవచ్చు. కాని నాకది చాల సహజంగా వుంటుంది. మెదడులోని ఆలోచన చేతిలోకి ప్రవహించి బంతిని తాకుతుంటే ఆ లయమధ్య ఇంకేదీ వుండదు. అది నా సామ్రాజ్యం. అక్కడంతా నా ఇష్టం. నా షాట్ గురితప్పడానికి వీలులేదు. అదొక కలలాంటి స్థితి. అద్భుతమైన స్థితి..."అని ఆగి

మనోహర్ "ఈ మాటలు అన్నవి సాక్షాత్తు టెన్నిస్ ఫల్గుణుండు గనుక చదువుతున్నాం గాని, ఇంకొకడయితే వెర్రివాడి కూతలు అని కొట్టి పారేద్దుము కదా---"అన్నాడు.

"నిజమే. నమ్మడం కష్టమే." అన్నాడు రేమన్.

రవి పలికాడు: "కొండంచున వున్న వాడు... అవతలివైపు గ్రామం కన్పిస్తుందర్రా -- అని అరిస్తే అవతలివైపా, నీ బొందా... పై పెచ్చు గ్రామం కూడానా... ఏమి కోతలోయ్?...అని క్రింద నిల్చున్నవాడు హేళనచేయడం సహజమే... అయితే మనోహర్, బోర్గ్ అంటే ఎవరనుకున్నావు? తన 15 వ యేటనే మొదలుపెట్టి ఏడంటే ఏడు సంవత్సరాల్లో టెన్నిస్ హిమాలయ శ్రేణిలో తన కీర్తి పతాకను నాటని టోర్నమెంట్ శిఖరం లేకుండా చేసిన మహాయోగి! దాని వెనుక ఎంత దీక్ష, ఎంత సాధన వుందో చదివి చూడు తెలుస్తుంది---"

"నువ్వన్నది కరక్టే... 365 రోజులూ తక్కువ పక్షం రోజుకు నాలుగు గంటలయినా టెన్నిస్ అభ్యాసం చేయకుండా వుండడట బోర్గ్. ఒకసారి ఏమయిందంటే సర్వీస్‌లో కొద్దిగా మార్పు తీసుకురావాలనుకున్నాడట! ఆచిన్న మార్పుని రోజుకు రెండు గంటల చొప్పున రెండు వారాలు ప్రాక్టీసు చేశాడట!"అని పత్రిక చూసి చెప్పాడు మనోహర్.

"ఆ నిష్ఠ వుంది కనుకనే అతడి మనసు ఏది అనుకుంటే శరీరం దానిని క్రియగా అనువదించ గల్గింది. "యధాయథా చిత్తం ప్రవర్తతే, తథా తథా విశ్వం పరివర్తతే---"అన్నారు మన వాళ్ళు. మనసెలా నడిస్తే విశ్వం అలా నడుస్తుంది. అన్న ఈ మాటలనే బోర్గ్ ఋజువు చేశాడు. ఇంకొక విధంగా వైద్యములో 'బయోఫీడ్‌బేక్'పద్ధతి ఋజువు చేస్తూంది--"అని చెబుతున్న రవి--

"సార్! మీకు ఫోన్‌కాల్..."క్లబ్‌బాయ్ చెప్పగానే, లేచి వెళ్ళాడు---

---"హల్లో--"

"రవీ, ఇంకా క్లబ్‌లోనే వున్నావా?"

"ఔను. ఒంట్లో ఎలావుంది మీనా?"

"ఫైన్! నువ్వు త్వరగావస్తే ఎటన్నా వెడదామనుకున్నారవీ..."

"ఇప్పుడు ఏడు దాటుతూంది. ఆస్పత్రిలో ఒక కేసుంది. చూసుకుని..."

"ఆ ఖంబట్టాయేనా?"

"ఔను డియర్, ఆమె స్థితి ఇకా ఆందోళనగానే వుంది."

"... ... ..."

"హలో, హలో, మీనా!"

"ఉన్నానిక్కడే... నేనెక్కడికి వెళ్తాను గనుక..."

"అదుగో మీనా? ఆ డిప్రెషన్ లోకి వెళ్ళిపోకు... స్విచ్ ఆన్ టి.వి.... ఇంకో అరగంటలో నీ ఫేవరేట్ సింగర్ జానకి ప్రోగ్రామ్ వుంది...."

"నీ సలహా చాలా నచ్చింది రవీ!"

"ఏం...."

"అశోకవనంలో జానకిలా నేను: నాకు తోడుగా జానకి పాట... వెరి అప్రొప్రియేట్!"

"అయితే జానకి గారూ! మరి నేను రాముడినా రావణుడినా?"

"నువ్వు రాముడివనే అనుకుంటున్నా: రావణుడివయినా ఫరవాలేదు...."

"ఏమిటంటున్నావ్ మీనా?"

"సీతమీద మనసుండడం ముఖ్యం అంటున్నా ... ఆ మనసుండే కదా రావణుడామెనెత్తుకు వెళ్ళిందీ--"

"ఓకే! నేను ఎనిమిదిన్నర పాటికి వస్తాను.. సరేనా?"

"అలాగే...."

--- టెలిఫోన్ ముగించి రవి వచ్చేసరికి రేమన్ మనోహర్‌లు కూడా లేచారు. ఐదు నిముషాల తర్వాత మూడు కార్లు బయలుదేరాయి.

-- డాక్టర్ రవిచంద్ర పాతమాడల్ అస్టిన్‌కారు ఆస్పత్రి పోర్టికోలో ఆగింది.

"గుడీవినింగ్ డాక్టర్! " రిసెప్షన్‌లో ఆంగ్లోఇండియన్ నర్స్ గ్రీటింగ్‌కు తలపంకించి రవిచంద్ర మేడమీద తన గదిలోకి వెళ్ళాడు ఫైలింగ్ సిస్టమ్‌లోని ఇండెక్స్‌లో 'ఎం' కింద వెతికాడు.

కేస్ ఫైల్ దొరికింది.

"మాలినీ ఖంబట్టా – అడ్మిషన్ 26 జులై"...." అంటే నేటికి 28 రోజులయిందన్న మాట.

రవిచంద్ర పేజీలు తిరగవేయసాగాడు.

* * *

మాలినీ ఖంబట్టా.

వయసు 34. షిప్పింగ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

భర్త విమానదళంలో స్క్వాడ్రన్‌లీడర్. ప్రస్తుతం రష్యాలో శిక్షణలో ఉన్నాడు. 12 సంవత్సరాల కొడుకు డూన్ పబ్లిక్ స్కూల్లో చదువుకుంటున్నాడు.

--- ఆమె రెండు వారాల కింద బాంబే నుండి ఢిల్లీ చేరింది. అక్కడ ప్రభుత్వం వారితో మాట్లాడాక టోక్యో వెళ్ళింది. అక్కడి నుండి సింగపూర్‌లో ఆగివున్న తమ నౌకలోని సిబ్బంది సమ్మెచేస్తుంటే అది పరిష్కరించి కొలంబో వచ్చింది. మదరాసు విమానాశ్రయంలో దిగుతుండగా కొద్దిగా జ్వరం. రాత్రికి విపరీతంగా ఒళ్ళునొప్పులు. మరురోజుదయానికి చేతివేళ్ళు ఏమిటోలా అన్పించాయి.

ఆస్పత్రిలో ఉదయం ఎనిమిదింటికి చేరింది. రకరకాల పరీక్షలు. ఉపశమన చికిత్సలు మొదలు పెట్టారు. కాని అయిదో రోజు పాటికి మెడ, చేతులు, వేళ్ళు, కాళ్ళు కదలడం కష్టమైంది. డయాగ్నస్టిక్ పరీక్షలలో ఎర్రకణాల సెడిమెంటేషన్ రేట్ 80 దాటినట్లు తేలింది. మరో మూడురోజులకు అది 115 కు పెరిగింది. కదలికలు అసాధ్యం అవసాగాయి. చర్మం కింద కాయలుకాయలుగా ఏర్పడసాగాయి.

తానప్పుడు పరీక్షలన్నీ చేశాడు. సాటి నిపుణులతో చర్చించాడు. అసలిది ఫలానా జబ్బు అని నిర్ధారణచేయడం కష్టమయింది. చివరకు తేలిందేమంటే కణాల నొకదానినొకటితో అతికించి వుంచే 'కొల్లాజెన్'విషపూరితం అయింది. అంటే శరీరపు నాడులలోని సిమెంటు దాని గుణాన్ని కోల్పోతుందని తేలింది. ఇది వెన్నెముకలోని టిష్యూకు కూడా సోకింది. ఎక్కడికక్కడ శరీరపు శతసహస్ర శకలాలు దేనికదిగా విడిపోతున్నాయి. రెండురోజుల సుదీర్ఘ చర్చల అనంతరం ఆ వ్యాధి "అన్ కైలోసింగ్ స్పాండిలైటిస్"గా తేల్చారు. నిపుణు లిద్దరూ కూడా ఆమె ఈ వ్యాధి నుండి సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడడం అసంభవం అన్నారు.

రవిచంద్ర తలవూచాడు గాని మనసులో వారితో అంగీకరించలేకపోయాడు.

అయిదారు గంటలు తన గదిలో ఒంటరిగా కూర్చుని ఆలోచించాడు.

సాయంకాలం అతడు మాలినీ ఖంబట్టా మంచం దగ్గరగా కూర్చున్నాడు.

"వినండి మిసెస్ మాలినీ, నేను చెప్పేది చాల జాగ్రత్తగా వినండి. చదువుకున్న వారు, ప్రపంచం చూసిన వారు, అన్నీ తెలిసినవారు కనుక మిమ్మల్ని ఒక ఫ్రెండ్‌గా భావించి అరమరికలు లేకుండా చెబుతాను....." అని ఆమె వ్యాధి వివరాలన్నీ చెప్పాడు. "ఇది వచ్చిన 500 మందిలో ఒక్కరు మాత్రం పూర్వపు ఆరోగ్యంతో బతుకుతారని గణాంకాలు చెబుతున్నాయి. మిగతా 499 మందిని నేనెరుగను గాని మీరు మాత్రం ఆ ఒక్కరుగా రోగాన్ని జయించి, లేచి తిరగాలి అని నిశ్చయించుకున్నాను. కాని ఇది నా ఒక్కడి వల్ల కాదు, కేవలం మందువల్ల అంతకన్నా కాదు. ఈ పోరాటంలో మన విజయానికి మీ పూర్తి సహకారం కావాలి. మీరు ఏ మాత్రమూ అధైర్యపడకూడదు." అని ఆమె మొహంలోకి చూచాడు.

శ్రద్ధగా వింటూంది ఆమె. రవిచంద్ర చెప్పసాగాడు.

"ఎంతో జీవితం మీ ముందుంది. మున్ముందు మీరు సాధించవలసినవి ఎన్నో వున్నాయి. అవన్నీ చేసితీరాలి అన్న పట్టుదల మీ కుండాలి. చేసి తీరు తాను అన్న ధైర్యం వుండాలి. ఆ పైన మీ డాక్టరయిన నన్ను నమ్మాలి. అప్పుడిహ రణభేరి మోగిద్దాం...." అని నవ్వాడు.

ఆమె చిరునవ్వు నవ్వింది. మాట్లాడ్డం కొంత కష్టమయినా వివరంగా మాట్లాడింది.

"డాక్టర్! నష్టంలో మునిగిపోతున్న ఓడలకంపెనీని మూడేళ్ళలో నిలబెట్టగలిగాను. ఆడది చేయగలదా అని నవ్వినవారి నోళ్ళు మూయించాను. ఇప్పుడింకో ప్రాజెక్టుంది. కంటెయినర్ షిప్పింగ్‌లో మన దేశం వెనకబడివుంది. ఆ రంగంలోకి మా కంపెనీని ప్రవేశ పెట్టి దేశానికి చేయాల్సిన సేవ వుంది. ఈ పడకమీద పడుకునే అయినా అది చేసి తీరతాను...."

కనుబొమ లెగరవేశాడు రవిచంద్ర. ఆమె చెబుతూంది.

"ఏడాది కిందటే ఉస్తాద్ హాఫీజ్‌ఖాన్ వద్ద శిష్యురాలిగా చేరి సితార్ సాధన మొదలుపెట్టాను. నాలుగయిదేళ్ళలో కనీసం ఒక్క కచేరీ అయినా చేయాలని వుంది. That is a promise I made to Amar అంటే మా ఆయన. ఆ మాట

నిలబెట్టుకుంటాను. ఇంత జీవితం ముందుండగా, అయిదు వందలలో ఒకటి మాత్రమే నా ఛాన్సయినపుడు, మీ లాంటి అపూర్వమైన డాక్టర్ నాకు తోడుగా నిలబడినప్పుడు, మీరు అందించిన ఆ చేతినందుకుని ఈ అగాధంనుండి పైకి వచ్చి తీరుతాను." అని మెరుస్తున్న కళ్ళతో చెప్పి, ఆమె తన చేతిని అతికష్టంతో పైకి ఎత్తుతుంటే, రవిచంద్ర ఆమె చేతినందుకుని "అదీ ఆత్మవిశ్వాసం అంటే! అప్పుడే సగం యుద్ధం గెలిచాం. రేపొక కొత్త ట్రీట్‌మెంట్ మొదలెడదాం–" అన్నాడు.

ఆ రాత్రి రవిచంద్ర ఇంటికి వెళ్ళ లేదు. సాహసించి పూనుకున్న ఈ యత్నం జయిస్తుందా? తాననుకున్నది సాధ్యం అవుతుందా? ఎక్కడి కక్కడ శిథిలమయి కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఆమె శరీరాంతర్భాగాలను కేవలం ఆమె మనోధైర్యంతో – ఏదో వున్న కొన్ని చాలీచాలని మందులతో తాను పునరుజ్జీవింపచేయగలడా? లేక ఉత్తమాటలే మిగులుతాయా?

ప్రతి నిజాయితీగల వైద్యుడికీ ఎదురయ్యే సమస్యే విశ్వరూపమెత్తి నిలుచుంది అతడి ఎదుట!

పని చేసినంతకాలం అంగుళమంగుళమూ, నిముషనిముషమూ, పరమాద్భుతాల పరంపర అన్పించే ఈ శరీరం అనే సిస్టమ్‌లో ఒక్క చిన్న మర పాడయితే – దాని ఎదుట – ఏడెనిమిదేళ్ళ చదువు, దశాబ్దాల అనుభవం మూగదయిపోతాయేం? 'ఏమిటి నీ బోడి విజ్ఞానం ?' అన్న ఎగతాళియా లేక 'ఇంకా నేర్వాలి నువ్వు' అన్న ఝుళిపింపా?

జీవరసాయనశాస్త్రం ఎన్ని ఫార్ములాలు తయారుచేస్తేనేమి, ఒక శరీరం లాంటి దొకటి లేదు కదా? ఒకే రోగం కల ఇద్దరికి అదే మందు ఒకేలా పనిచేస్తుందని చెప్పలేమే....అలాటి స్థితిలో మొత్తంమీద మందులు గుణమిస్తున్నాయి. అంటే రోగాన్ని నయంచేసేది మందొక్కటే కాదేమో? రోగం నయం కావడానికి సాయంచేసేది ఇంకేదన్నా వుందేమో.....

రసాలూ మామిడే, రుమానీ మామిడే కాని రుచులు వేరు. అలాగే విభాగాలు ఒక్కటే, పదార్థాలూ ఆకారాలూ ఒక లాగేఉన్న ఏ శరీర ధర్మం దానిదే....

"యారమితా వనమాలినా సఖీ!" – అద్భుతమైన అష్టపది. మహా భక్తుడు జయదేవుడి లేఖిని నుండి జాలువారినది. దానిని బాలమురళి పాడితే విలక్షణంగా భావస్ఫోరకంగా వుంటుంది. ఘంటసాల పాడితే, నిండుగా, మధురంగా వుంటుంది. భానుమతి పాడితే శ్రావ్యంగా తీయని బాధలా వుంటుంది. .... దానినే మంటారు? మనోధర్మం అని కాబోలు.

అదీ అసలు కిటుకు! మనసు!

ఇదివరలో తనకు అక్కడక్కడ లీలగా ఎదురయిన సత్యమే స్పష్టంగా సాక్షాత్కరించినట్లయింది.

–మరింత దీక్షతో వైద్యశాస్త్ర పరిశోధనా గ్రంథాలను ఇటీవల 'లేన్సెట్' 'కెమికల్ – బయొలాజికల్ ఇంటరాక్ట్' లాంటి పత్రికలను తిరగవేశాడు. Wisdom of the

body ని రచించిన వోల్టర్ బి. కేనన్, రెనెడ్యుబో, బ్లాక్‌వెల్, అర్తర్ కె. షెపిరోలు తను చదివినవారే.... కాని ఇవాళ వాళ్ళ పరిశోధనలూ, ప్రయోగాలూ రచనలూ అన్ని ఏకోన్ముఖంగా కలిసి దిశను సూచిస్తున్నట్లున్నాయి. ఈవేళ అవి చదువుతూ వుంటే ఆవేశం వచ్చినట్లయింది. ఆ గదిలో ఆ ఒంటరితనపు సమాధి దశలో 'ప్లేసెబో' సాక్షాత్కారం అయింది.

అమృతభాండం చేత ధరించిన మారినా మోయా ప్లేసెబో.

ఇమిటేషన్ మందు ప్లేసెబో.

అచ్చంగా మందు మాత్రలాగే పంచదార బిళ్ళ తయారుచేస్తే అది ప్లేసెబో – రోగి మందుకావాలి. మందుకావాలి అని పోరాడేచోట అతడిని తృప్తి పరచడానికని (అంతేకాని, అతని రోగాని కది మందు – అని కాదు) ఇచ్చేది ప్లేసెబో. సాధారణంగా కొత్తమందును పరీక్షించే దశలలో ప్లేసెబోను వాడుతుంటారు.

రవిచంద్ర అమెరికాలో వుండగా ప్లేసెబో ప్రభావంమీద అర్తర్ షెపిరో, హెన్రీబీచర్, స్టువర్ట్‌వుల్ఫ్, లూయీ లాసగ్నాలను చదివి వున్నాడు. ప్లేసెబోలు ఔషధంవలె కన్పించడమేకాదు, ఔషధంలా పనిచేస్తాయి – అని వాళ్ళురాశారు.

కాని ఇవాల్టి స్థితిలో అతడికి కన్పించింది – శరీరానికి ఆధారబిందువు మనసయితే ఆ రెంటిని సంధానం చేసే శక్తి ప్లేసెబో, శరీరంనుండి మనసు వేరు కాదని చెప్పింది అది. జీవించాలన్న మనిషి కోర్కెను జీవన ప్రసాదశక్తిగా మార్చి శరీరాని కివ్వగల సంజీవని ప్లేసెబో.

కొత్త ఉత్సాహంతో లేచాడు డాక్టర్ రవిచంద్ర.

డ్యూటి డాక్టర్‌తో చేయాల్సిన వన్నీ చెప్పాడు. తాను ఉదయం తొమ్మిదింటికి వచ్చేసరికి అన్నీ సిద్ధంగా ఉంచమని చెప్పాడు.

అస్పత్రి వదిలాడు.

ఇల్లు చేరి బట్టలు మార్చుకున్నాడు. పడుకోబోయేసరికి నాలుగ్గంటలని చెప్పింది గడియారం.

మంచంమీద పడుకోబోయి, పక్కన టేబిల్‌మీద సీసా చూశాడు. గార్డినాల్!

నిద్ర పట్టలేదు కాబోలు మీనాక్షికి. అయినా నిద్రమాత్రలు వేసుకోవద్దని చెప్పాడు.

పాపం మీనాక్షి...గుండెజబ్బు కారణంగా కాలేజికి దీర్ఘకాలిక సెలవు పెట్టింది. కాని తాను ఆమెతో ఎక్కువ కాలం గడపలేకపోతున్నాడు. వైద్యం చదువుతున్న కూతురు విజయ. కాలేజి, చదువు, ఆటలు, పాటలు, పిక్‌నిక్‌లు, స్నేహితులలో అమ్మను పట్టించుకున్నట్లు లేదు.

తన పక్కను ఒత్తిగిల్లిన మీనాక్షి కుంకుమ ఆ మసక వెలుతురులో కూడా ఎర్రగా మెరిసింది. ఆమె నుదుటిమీద చుంబించి పడుకున్నాడు రవిచంద్ర.

నిద్రపట్టింది.

"మాలినీ! యూ ఆర్ గ్రేట్ ! మనిద్దరం కలిసి ఓడిద్దాం....."

హఠాత్తుగా లేచింది మీనాక్షి.

తన నడుముదగ్గర తల దూర్చుకుని నిద్రపోతున్న రవిచంద్ర కలవరిస్తున్నాడు.

ఎప్పుడొచ్చాడు. తను? రాత్రి పదకొండు గంటలవేళ తను ఆస్పత్రికి ఫోన్ చేస్తే – "ఇంటినుండి ఫోన్ వచ్చినా సరే డిస్టర్బ్ చేయవద్దన్నారండీ–" అని చెప్పిందే నర్సు.

ఏమిటా పని? ఇప్పుడీ మాలిని ఏమిటి? ఇద్దరూ కలవడం ఏమిటి? ఓడించేదెవరిని?

మాత్ర ప్రసాదించిన నిద్రమత్తు వదిలిపోగా గబగబ కోపం వచ్చేసింది మీనాక్షికి.

పది నిముషాల తర్వాత ఉలిక్కిపడి లేవడం రవిచంద్ర వంతయింది.

గుండె నొప్పితో విలవిలలాడుతున్న మీనాక్షికి వెంటనే ఇంజక్షనిచ్చాడు. తన ఒడిలో పడుకోబెట్టుకుని నెమ్మదిగా అన్నీ చెప్పాడు. ఆమె అన్నీ విన్నది.

కానీ – ఇంతకు ముందిలా వుండేవాడు కాదే....ఎందరో పేషెంట్లను, ఆడ పేషంట్లను ట్రీట్ చేశాడు కాని.... ఇలా కలవరింతలు ఎప్పుడూ లేవే? ఏమిటిదంతా? ఏమవుతున్నాడు రవి?–

నలభయ్యో పడిలో పడిన తన ఆకర్షణ తగ్గిందా? తన అనారోగ్యం ఏర్పరచిన అగాధమా? కలిసి పెంచి ముద్దాడి ఎత్తుకుని పోటీలుపడి గారాబుచేసే వయసును విజయ దాటి బయటి ప్రపంచంలోకి ఎగిరిపోయినందున ఏర్పడిన శూన్యాన్ని తామిద్దరూ కలిసి కూడా కాదనలేక పోతున్నారా? కాలేజి, బోధన, పాలనా వ్యవహారాలతో మునిగితేలుతున్నందున రవి తనకు దూరం అవుతున్నాడా? లేక ఇన్నాళ్ళు తన ఉద్యోగమే ప్రపంచంగా బతికిన తనకు గత మూడు మాసాలుగా అది లేనందున తీరిక ఎక్కువయి, రవినుంచి తాను ఎక్కువగా ఏదో కోరుతున్నదా?

అంత నొప్పిలోను, అతడి ఒడిలో పడుకునే వుండినప్పటికీ, అతడు ఆమె పట్ల తన మమతానురాగాల నంతటినీ స్పర్శగా మార్చి వేళ్ళలో ఆమె చెంపల మీద కవితలు రాస్తూండగా కూడా – ఆమె అతడికి దూరంగానే వుండిపోయింది.

అతడు చెప్పినవన్నీ మాటలుగానే మిగిలిపోయాయి.

కొంతసేపటికి ఆమె బాధ తగ్గింది, కన్ను అరమోడ్చింది.

రవి మనసు రెక్కలుండీ ఎగరలేని పక్షి అయింది. మీనాక్షి మీద ప్రేమ, అనురాగం, జాలి పెల్లుబికాయి. కాని దానినంతటినీ ద్రవీభూతం చేసి, సీసాలోకి పోసి, ధమనుల్లోకి ఎక్కించలేను కదా అన్పించింది. ఆమె చంచల చిత్తం వలెనే అల్లల్లాడుతున్న ఆమె ముంగురులను ఆర్ద్రతతో సరిచేశాడు. ఆమెను పడక మీద పడుకోబెట్టాడు. ఆస్పత్రికి ఫోన్ చేసి నర్స్‌ని ఇంటికి పంపమన్నాడు లేచాడు.

ఇంతకు ముందెన్నడూ లేనిదివాళ, కొత్తగా కడుపులో మంట – అంది మీనాక్షి. ఏమిటో ఆ కాంప్లికేషన్....చూడాలి అనుకుంటూ, కాఫీ, షేవ్, స్నానం ముగించాడు. వంటావిడ రాలేదు. బ్రెడ్ టోస్ట్‌చేసి ఫ్లాస్క్‌లో కాఫీ పోశాడు.

తొమ్మిదింటికల్లా ఆస్పత్రికి చేరాడు. మాలిని గదిలోకి వెళ్ళాడు. మబ్బుల మధ్య మెరుపులా ఆమె చిరునవ్వు నవ్వింది.

"గుడ్‌మార్నింగ్!" అని డాక్టర్‌ను - "అన్నీ సిద్ధమేనా?" అని అడిగాడు రవిచంద్ర.

"ఎస్ సార్!"

"తీసుకు రమ్మనండి." ఆ డాక్టర్ బయటికి వెళ్ళాడు.

"మాలినీజీ! ది జర్నీ బిగిన్స్....ఇండియాలో ఇంతవరకు ఎవరూ వాడని కొత్త మందును మీ కిస్తున్నాను, ఇదిగాక ఒక ఇంట్రావీనస్ డ్రిప్ ఒకటిస్తాను. రోగాన్ని ఎదుర్కొనేది ఒకటి, శరీరానికి అదనంగా శక్తినిచ్చేది ఒకటి - ఈ రెండూ కలసి మీ బాధను తప్పకుండా తరిమివేయాలి...."

డాక్టర్ నర్స్ వచ్చారు. రవిచంద్ర ఇంజక్షనిచ్చాడు. చాల జాగ్రత్తగా డ్రిప్ ఏర్పాటుచేశాడు. అదయ్యాక వాళ్ళు వెళ్ళిపోయారు. ఆమె పక్కన కూచుని రవిచంద్ర చెప్పాడు.

"చూడండి...నేనా రోజు మీకు చెప్పాను కదా... విపరీతమైన ఒత్తిడి, stress వలన మీ శరీర వ్యవస్థ దెబ్బ తిన్నది అని. కనుక ఇప్పుడు చాలా హాయిగా రిలాక్సవాలి. బాగా నవ్వాలి. చక్కటి హాస్యరసభరితాలయిన పుస్తకాలు వోడ్‌హౌస్, హెరియట్, థర్బర్, థార్న్‌స్మిత్, వా- అన్నీ మా సిస్టర్ మేరీకుట్టి వద్ద వున్నాయి. రోజుకీ గంట, రెండు గంటలు మాత్రమే చదివి విన్పిస్తుంది. జోక్స్ పుస్తకాలు నేను పంపుతాను. రోజూ సాయంకాలం అయ్యే సరికి అందాక మీరు విన్న best joke నాకు చెప్పాలి మీరు. సరేనా?"

కళ్ళతోనే అంగీకారం తెలిపిందామె. ఆమె గది విడిచి బయటికి వచ్చాడు. తన గదిలోకి వెళ్తుండగా - "మనసు స్వాధీనమైన యా ఘనునికి- మఱి మంత్ర తంత్రములేల?" అన్న త్యాగయ్య కృతి గుర్తొచ్చింది. 'ఆ మనసలా అందరికీ స్వాధీనం అయిపోతే ఇంకా మీ రెందుకు స్వామీ–' అని నవ్వుకున్నాడు.

ఆస్పత్రి రౌండ్సన్నీ ముగించి, మిగతా పనులు చూచుకుని, మాలినిని చూశాడు. ఆమె నిద్రమాత్రలవసరం లేకుండా హాయిగా నిద్రపోతోంది. వెంటనే సెడ్ - రేట్ పరీక్ష చేయించాడు. తొమ్మిది పాయింట్లు తగ్గింది, కేవలం నాలుగు గంటల వ్యవధిలో వ్యాధి దిశ మారింది. శత్రువు పలాయనం చిత్తగిస్తున్నదా!

ఇల్లు చేరాడు.

మీనాక్షి మేలుకుని వుంది.

అతడిని చూడగానే నర్స్ బయటకు వెళ్ళింది.

"ఎలా వున్నారు దేవీజీ?" - విషాదంగా నవ్వింది మీనాక్షి.

"నొప్పివుందా?"

"లేదనుకుంటాను. డల్ గా వుంది."

"మందు ప్రభావం కాబోలు–"

"ఉండు, నీకు చక్కని సూప్ తెచ్చిస్తాను." వంటావిడతో చెప్పి నిముషాల మీద చేయించి తీసుకొచ్చాడు.

"రవీ! నువ్వు భోంచేయి...."

"నువ్వు ముందిది తాగు. తర్వాత నా భోజనం...అటుపిమ్మట రాజూ రాణీ కూర్చుని ప్రపంచ స్థితిగతులను సమీక్షించుట.... అదీ ఎజెండా...." నవ్వింది మీనాక్షి.

పావుగంటలో భోజనం ముగించుకుని వచ్చాడు. "అదేమిటి? సగం వదిలేశావేమిటి సూప్?"

"చాలు రవీ, థాంక్స్!"

ఏమిటీ లాంఛనప్రాయమైన సంభాషణ అన్నట్లు, కళ్ళు చిట్లించి ఆమె వైపు చూశాడు.

ఆమె కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆకాశం నిండా మబ్బులు, సూర్యుడు లేని మందకొడి వెలుతురు.

అయిదు నిముషాలయ్యాక ఆమె పలికింది. "రవీ! నేను కాలేజిలో జాయినవుదామనుకుంటున్నాను."

"మీనా ! నీ గుండెస్థితి ఇంకా stabilize కాలేదు. టీచింగ్, అడ్మినిస్ట్రేషన్, మీటింగ్స్ – ఆ ఒత్తిడికి తట్టుకోలేవు."

తల నడ్డంగా వూచిందామె. "నో రవీ! ఇలా ఖాళీగా వుంటుంటే ఈ ఒత్తిడే తట్టుకోలేక పోతున్నాను. నా మనశ్శాంతికి నా రొటీనే కవచం. కనుక, ఎల్లుండి సోమవారం నుండి చేరనా?"

ఒక్క నిముషం వూర్కుండి, నిదానంగా చెప్పాడు రవిచంద్ర. "డాక్టరుగా నీ వాదనను అర్థం చేసుకోగలను. కాని భర్తగా నీ కోరిక నామోదించలేను మీనా?"

నవ్వింది మీనాక్షి. జీవంలేని నవ్వు అది.

ఆమె ఏదో అంటుందని ఎదురు చూశాడు. కాని ఆమె మాట్లాడకపోయే సరికి –"చెప్పు మీనా! నీకేదో చెప్పాలని వుంది. Get it off your chest. అది నీ ఆరోగ్యానికి మంచిది."

"రవీ!"

"ఎస్!"

"భర్తగా 'నిన్ను వెళ్ళనివ్వను –' అన్నావే అది చాల హాయిగా వుంది వినడానికి.... భార్యగా నిన్నొకటి అడుగుతాను..... ఒప్పుకుంటావా?"

"చెప్పు –"

"ఒక్క వారంరోజులు ఇద్దరం కులూవో, మనాలియో వెళ్దాం పద. వస్తావా?"

"–"

"చెప్పు రవీ? Shall We?"

రెండు నిముషాల పాటు ఏమీ మాట్లాడలేకపోయాడు రవి చంద్ర. బయట వర్షం పడుతోంది.

"నాకు తెలుసు రవీ.... నీకు రావాలనిలేదు కాని వదలిరాలేని పని వుంది. ఆ పని వదిలి పెడితే నీకు స్వర్గం వెళ్ళినా సుఖంగా వుండదు నేను నిన్ను అందుకు నిందించను... నాకూ అంతే రవీ? నా పని నాకూ, నా పనికి నేనూ అంతే అవసరం."

"నువ్వు చెప్పేది కరెక్టే కాని మీనా, సరికాదు అని కూడా అన్పిస్తూంది నాకు."

"లేదు రవీ? నాకోసం నీ పనిని వదులుకుని నువ్వు రాలేవు. నీ మాట కోసం నేను పనిమాని నీ ఎదుట కూచోలేను. మనం ఆ రొమాంటిక్ ఏజ్ దాటిపోయాం. ఈ వయసులో ఎవరి జీవితానికి వారు సార్థకత్వం వెతకడం చాల సహజమే. అందుకు గిల్టీగా ఫీలవ్వ వలసిన పని లేదు."

"కాని మీనా.... రెండు విషయాలు, ఒకటి – నేను నిన్ను పనిలోకి వెళ్ళవద్దన్నది నీ ఆరోగ్యం కోసమే కాని నా కోసం కాదు. నీతో కలిసి యుగాలయినా గడపడం నా కిష్టమే....కాని ఇప్పుడు చెబుతున్నది నాకోసం కాదు. రెండు– పాతికేళ్ళు పెనవేసుకు ప్రవహించిన జీవనస్రవంతి మధ్య ఈ సహారా ఏమిటి? ఈ పొడి పొడి లాజిక్కేమిటి?"

"జీవితంలోని మేజిక్ హరించి పోయాక మిగిలేది లాజిక్కే రవీ! అందులోనూ నేను హిస్టరీ ప్రొఫెసర్ని కదా! తడితడి మాటలు రావు. నిజాన్ని నిజంగా చెబితే నీ కలా అన్పించి వుంటుంది."

"మీనా!"..... అంటూ మృదువుగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు రవి, కానీ ఆమె తన్ను దగ్గరకు తీసుకుని వుంటే బాగుండేది అన్పించింది అతడికి.

....నో....శరీరాలు స్పందించలేదు. బయట వర్షం ఆగింది. మబ్బులు మాయం అయ్యాయి. కాని సూర్యుడు మాత్రం రాలేదు.

* * *

ఈ నాలుగు వారాలూ అలాగే గడిచాయి. మీనాక్షి కాలేజిలో చేరింది.... ఎందుకో మరి హఠాత్తుగా ఇవాళ టెన్నిస్ క్లబ్‌కు ఫోన్ చేసింది.

రావణుడయినా ఫరవాలేదు మనసుంటే చాలు – అంది.... అంటే తనేమి చేశాడని, లేక చేయలేదని? కేస్‌షీట్ వివరాలు చూస్తుండగా డ్యూటీ డాక్టర్ వచ్చాడు.

"మాలిని ఎలా వున్నారు?"

"లేచి కూచుంటున్నారు సార్."

"గుడ్..... నేనే వస్తున్నాను." వివరాలు షీట్‌మీద రాసి ఫైల్ చేశాడు.

నాలుగు వారాలలో మాలిని ఆరోగ్యం ఊహించనంతగా మెరుగయింది. సెడ్–రేటు ఇంచుమించు మామూలు స్థాయికి దిగింది. ప్లేసెబో అద్భుతంగా పనిచేసింది. మూడు వారాలకు అవిడ కాళ్ళ నొప్పులన్నీ తగ్గాయి. కొద్ది సాయంతో కూచోగలుగుతూంది. ఇంకో నాలుగయిదు వారాలలో ఆమె నడుస్తుంది. అప్పుడు తనకో పెద్ద ప్రశ్నకు జవాబు దొరికినట్లవుతుంది.

మనసుకు శరీరం మీద ప్రభావం వుందా? అంటే ఉంది, అని ఋజువులతో సహా చెప్పగలడు తను. జాగ్రత్తగా ఇవన్నీ సమీకరించి ఒక 'పేపర్' రాయాలి.... అనుకుంటూ ఆమె గదిలోకి అడుగుపెట్టాడు.

"హలో డాక్టర్!"

"ఎలా వున్నారు మాలినీ!"

"చాల మేలుగా వుంది... ఐదు వందలలో ఒకటి నిజమయినట్లేనా డాక్టర్?"

"ఎస్! మీ రది ఋజువుచేశారు....ఏమిటిది అమర్‌నుంచి వుత్తరమా–" అని అడిగాడు రవి, తన ఈ పరిస్థితి గురించి భర్తకు తెలియనివ్వ వద్దన్న ఆమె మాటలు గుర్తుకు రాగా.

"ఔను....రొటీన్ స్టఫ్.... వోడ్కా అంటే డోకు వస్తూందిట.....డాక్టర్, నేనెప్పుడు లేచి తిరగవచ్చు–"

"ఎపుడు తిరగగల్గితే అప్పుడు. ఎప్పుడు తిరగాలి అని మనసార అనుకుంటే అప్పుడు."

"నిజమే!" మాలిని కళ్ళు పెద్దవి అయ్యాయి. "అయితే రేపే ఈ సింహాసనమును వదిలి దిగెదను గాక...." అంది రాణిలా ఠీవిగా.

"ఎవరక్కడ?" అని అంతఃపురంలోలా చప్పట్లు కొట్టాడు రవిచంద్ర. ఇద్దరూ నవ్వారు–

"అన్నట్లు డాక్టర్‌గారూ! ఇవాళ్టి జోక్ చెప్పనా.... ఇది చాల వింటేజి విట్టు, ఛార్లెస్ డికెన్స్‌ది. డికెన్స్ సృష్టించిన ఒక మగవాడిలా అంటాను. "ఇదుగో చూడండబ్బాయిలూ! ఇంటిలో విషయాలన్నిటిమీద మా ఆవిడ సలహాలే పాటిస్తాను. ఆవిడకా బుద్ధి కుశలత వుంది. కాని ఛస్తే ఆ విషయం ఆవిడ ఎదుట మాత్రం ఒప్పుకోను– ఎందుకంటారారా? డిసిప్లినండీ, ఇంట్లో డిసిప్లిన్ వుండొద్దూ – అందుకని?"

ఆమె నవ్వుతో శ్రుతి కలిపాడు రవిచంద్ర.

"అలాటివాడి కోసమే పుట్టింది 'ఎం.సి.సి.' అన్న నామధేయం! అవునా?" అన్నాడు. 'అంటే ఏమిటి?' అన్నట్లుగా చూచిన చూపుకు అతడు "మేల్ షావినిస్ట్ పిగ్!" అన్నాడు. మళ్ళీ నవ్వింది ఆమె.

"డాక్టర్ డాక్టర్! నిన్నొక పెద్ద ఆశ్చర్యం కల్గించే పోస్టు వచ్చింది."

"ఏమిటి?"

"మా ఉస్తాద్‌గారు నాకోసం తాను వాయించి రికార్డ్ చేయించిన కేసెట్ పంపారు. ఆ జైజైవంతి అలౌకికం అంటే నమ్మండి.... తీరిక వున్నప్పుడు వినాలి. అది సితార్ వాదనం కాదు, పారిజాతాల శివతాండవం, నక్షత్రాల జడివాన...."

అలా ఆవిడ గలగల మాట్లాడుతుంటే రవిచంద్ర అనుకున్నాడు– చకచకమని కొమ్మనుండి కొమ్మకు ఎగిరే పక్షిలాటి ఈవిడకు ఎన్ని లక్ష్యాలు, ఆశలు, ఆశయా లున్నాయి..... ఈమె తప్పకుండా ఆరోగ్యవంతురాలవుతుంది. తిరుగుతుంది. అనుకు న్నది సాధిస్తుంది. 'జీవేమ శరదశ్శతమ్' అన్నట్లు నూరేళ్ళు నిండుగా బతుకుతుంది.

అదీ ఆ మనసు యొక్క శక్తి!

– ఆ మరురోజు రాత్రి..... ఇంటి దగ్గర

"నువ్వు నాలుగు వారాల కింద అడిగావు కదా.... కులూ వెళ్దామని? వచ్చే వారం వెళ్దామా?" అని మీనానడిగాడు రవి.

"సారీ డియర్! మూడునెలల తర్వాత డ్యూటీలో చేరి రెండువారాలు అయింది. ఇంతలో మళ్ళీ వారం పెడితే బాగుండదు. అందులోనూ ప్రిన్సిపాల్ ని కదా–"

తల పంకించాడు రవిచంద్ర. జీవితపు దారి చాల చిత్రమైంది.... దీనినే గ్రీకు డ్రామాలో నెమెసిస్ అంటారు ..... అన్పించింది.

– ఆ రోజు శ్రావణ పూర్ణిమ.

పొద్దున ఏదో సమావేశానికి వెళ్ళిన రవిచంద్ర అస్పత్రి చేరేసరికి మధ్యాహ్నం 12 అయింది.

వెళ్ళగానే స్టాఫ్‌నర్స్ చెప్పింది.

"సార్! మాలినిగారు మీకోసం చాల సార్లు అడిగారు."

"ఐసీ!"

– ఏదన్నా కాంప్లికేషన్స్ వచ్చాయా అనుకుంటూ గబగబ ఆమె గదిలోకి వెళ్ళాడు. ఆమె మామూలుగ వుంది. ఆమె పాపిట సింధూరం కళకళలాడుతూంది. పడక దిగి ఆమె నెమ్మదిగా అడుగులు వేస్తూ ఎదురువచ్చింది.

"డాక్టర్ భయ్యా! ఇవాళ రాఖీ పూర్ణిమ. మీకు రాఖీ కట్టాలని పొద్దుటి నుంచి కాచుకుని కూర్చున్నాను.–" అనే సరికి రవిచంద్ర అప్రతిభుడయ్యాడు. కుడిచేయి ముందుకు జాచాడు.

ఆమె ఆ చేతికి రాఖీ కట్టింది. కట్టి వెంటనే అతడి పాదాలంటి నమస్కరించబోయింది. ఇంకా శరీరం పూర్తిగా స్వాధీనం కానందున తూలిపడబోయింది. పడకుండా ఆమెను నడుముదగ్గర పట్టుకుని ఆపాడు రవిచంద్ర. నెమ్మదిగా అతడి భుజంమీద చేయివేసి ఆయాసపడుతూ మంచంవైపు ఆమె అడుగులు వేస్తుండగా–

– అర్జెంటుగా జాయింటకవుంట్ చెక్‌మీద రవి సంతకం కావాలని, కాలేజి నుండి కారేసుకుని, ఆస్పత్రి చేరి గదిలో లేని అతడిని వెతుక్కుంటూ వచ్చి మీనాక్షి వేసిన –

"రవీ!" అన్న కేక విని అటు తిరిగిన రవికి చేతిలోని సంచి జారి పడిపోతుండగా పక్కనున్న మేజా నానుకుందామని తడబడతున్న మీనాక్షి –

కనపడింది, పరుగెత్తాడు.

* * *

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వెలుపల సోఫాలో కునికిపాట్లు పడుతున్నాడు రవిచంద్ర.

కింద, వీధిలో పాలవ్యాన్ వచ్చి ఆగింది. ఆ చప్పుడుకు ఉలిక్కిపడ్డాడు. కళ్ళు నులుముకున్నాడు. వాచీ చూశాడు. ఐదూ యాభై రెండు, లోపలికి తొంగి చూశాడు.

నర్సు కళ్ళెగరవేసింది. మీనా స్థితి అలాగే వుంది. ఇంకొక రోజంతా గడవాలి.

మళ్ళీ బయటికి వచ్చి కిటికీలోంచి చూశాడు. పాలవ్యాన్ వెళ్ళిపోతోంది. తోటలోని నీటికొలను మధ్య రాత్రి వెన్నెట్లో కళకలాడిన కలువపూలు ముడుచుకుపోతున్నాయ్. తూరుపువయిపు చూశాడు. ఆకాశం వాకిట అరుణిమ చల్లివుంది. సూర్యుడు రావడానికి సమాయత్తమవుతున్నాడు.....

.....రోడ్ అవతల టీ దుకాణంలో భక్తిరంజని ముగిసి, సూక్తి ముక్తావళి మొదలయింది. స్పష్టంగానే వినబడసాగింది.

"మంత్రే, తీర్థే, తథా దైవే దైవజ్ఞే, భేషజే, గురౌ యాదృశీ భావనా యాత్ర సిద్ధిర్భవతి తాదృశీ!"

అని ఆలపించిన ముక్కుపొడుంగొంతే తాత్పర్యం చెప్పసాగింది.

"మంత్రమునందు, తీర్థమునందు, దైవమునందు, గురువునందు, జ్యోతిష్కుల యందు, ఔషధమునందు ఎట్టి భావమో అట్టి సిద్ధియో కలుగును....."

....ఔను నిజమే! మీనాక్షిని చూడటానికి ఇంకో స్పెషలిస్టును పిలవాలి. తనను మనిషిగానే నమ్మనపుడు డాక్టరుగా ఎలా నమ్ముతుంది. తన అంతరంగం కన్న, వృత్తిధర్మంలో తన పరాజయంకన్న ఆమె ప్రాణం చాలా ముఖ్యం.

ఆమె ప్రాణానికి ఆమె నమ్మకం, ఆమె సహకారం కావాలి. అది చాల ముఖ్యం.

తన గదిలోకి వెళ్ళి డాక్టర్ అగర్వాల్ ఇంటికి ఫోన్ చేశాడు రవిచంద్ర. మాట్లాడసాగాడు.

మేడమీద గదిలో మాలిని చెబుతుండగా నర్సు అమర్‌కు ఉత్తరం రాయసాగింది.

(యువ దీపావళి సంచిక '82)